

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## బందీ

**"ప్రేమ ఎవరు?" తలుపు** తీస్తూనే తీక్షణంగా అడిగింది గంగ.

"ప్రేమా?" అలసిపోయి వాడిపోయిన మొహంతో ఉన్న హరి తెల్లమొహం వేసాడు.

"అదే ఎవరంటున్నాను?" అరిచింది గంగ.

"ప్లీజ్ గంగా పదికిలోమీటర్లు డ్రైవ్ చేసుకుని వచ్చాను. విషయం ఏంటో చెప్పు?" ప్రాధేయపడ్డాడు హరి.

" 'హరికి కాల్ చేసాను. డ్రైవ్ చేస్తున్నాడనుకుంటా. రాగానే ఒకసారి నాకు ఫోన్ చేయమని చెప్పండి' అని లేండ్ లైన్‌కి ఫోన్ చేసిన ప్రేమలత" వెటకారంగా చెప్పింది.

"ప్రేమలతగారా? ఇప్పటిదాకా కలిసే ఉన్నామే?" కంగారుగా జేబులోంచి సెల్‌ఫోన్ తీసి, మిస్డ్ కాల్స్ గమనించి ఆమెకి కాల్ చేసాడు హరి.

"సారీ అండి. ఫోన్ చూసుకోలేదు. ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు.

కోపంతో ధుమధుమలాడుతూ అతన్నే గమనిస్తున్న గంగని పట్టించుకోకుండా చెప్పులు వేసుకుంటూ చెప్పాడు.

"ప్రేమలతగారు ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా ఎవరో దోచుకుపోయారట. నేను వెళ్ళి పోలీస్ రిపోర్ట్ ఇవ్వడంలో హెల్ప్ చేసి వస్తాను."

"ఏం మీరు తప్ప ఆవిడకి ఇంకెవరూ ఆత్మీయులు లేరా?" అరిచింది గంగ.

"లేరు."

వెనకనుంచి తలుపు ధన్ మని మూసుకుంది.

రాత్రి ఎనిమిదిన్నరకి నీరసంగా వచ్చాడు హరి.

"ఏం అప్పుడే వచ్చారు? ఓదార్పు యాత్ర ముగిసిందా?" కరుకుగా ప్రశ్నించింది గంగ.

"ప్లీజ్ గంగా చాలా అలసిపోయాను. స్నానం చేసి వస్తా వడ్డించెయ్" ప్రాధేయపూర్వకంగా చెప్పాడు.

"ఆవిడింట్లో స్టవ్, గిన్నెలుకూడా దొంగలెత్తుకుపోయారా? పోనీ హోటల్‌లో తినిపించి, తిని రాకూడదూ?"

హరి మౌనంగా తన సెల్ ఫోన్ తీసి, ఓ ఫోటో చూపించి చెప్పాడు.

"చూడు. ప్రేమలత అంటే ఈవిడే. ఏభై ఎనిమిదేళ్ళు. విడో. ఒక్కడే కొడుకు. ఏదో దేశంలో ఉంటాడు. నన్ను కొడుకుగానే భావిస్తారు. అర్థమైందా నేను ఆవిడ సహాయానికి ఎందుకు వెళ్ళానో?"

ఆ ఫోటో తేరిపార చూసింది గంగ. తెలుపు, నలుపు కలనేత జుట్టుతో కొంచెం లావుగా, ఉన్న ఒకావిడ ఎదురుగా ఉన్న పోలీస్ ఆఫీసర్‌తో మాట్లాడుతోంది.

"నీ అనుమానం నాకు తెలుసు గంగా. అందుకే ఇందాక పోలీస్ స్టేషన్‌లో ఈ ఫోటో తీసాను అర్థమైంది కదా. పేరు మోడ్రన్‌గా ఉన్నా ఆవిడ రెండేళ్ళలో రిటైరైపోయే పెద్దావిడ" అనునయంగా చెప్పాడు హరి.

"మరి ఈ ముక్క ఇందాకే చెపితే మీ సొమ్మేం పోయింది? అనవసరంగా ఇందాకటి నుంచి తెగ బాధపడిపోతున్నాను తెలుసా?" గోముగా చెప్పింది గంగ.

"ఇవాళైనా తొందరగా వస్తారా? లేక షికార్లు తిరిగి నిద్రొచ్చినప్పుడు కొంపకి వస్తారా?"

ఆఫీస్‌కి తయారవుతున్న హరి ఓసారి ఆమె వంక చూసి మౌనంగా తన పని తను చేసుకోసాగాడు.

"మాట్లాడరే? దానర్థం ఏమిటి? వస్తాననా రాననా?" అరిచింది గంగ.

"కొంచెం మెల్లగా మాట్లాడు గంగా. నేను ఇక్కడే ఉన్నాకదా!"

"ఉండి ఉపయోగం ఏంటీ? నా మాటలకి సమాధానం చెప్పరే?" అదే స్థాయి గొంతుతో అడిగింది.

"రాక ఎక్కడికి వెళ్తాను? ఆఫీస్ పని ఎప్పుడైతే అప్పుడు ఇంటికి వచ్చేస్తాగా. రోజూ ఎందుకు అదే ప్రశ్నవేస్తావు?" విసుగ్గా ప్రశ్నించాడు హరి.

"ఏమో ఎక్కడికి వెళ్తారో నాకేం తెలుసు. సాయంత్రందాకా ఒక్కదాన్నే ఉంటాను కాబట్టి మీరు ఎప్పుడెప్పుడొస్తారా అని చూస్తూంటాను అంతే."

"చదువుకున్నావుగా గంగా పోనీ నువ్వూ ఏదైనా ఉద్యోగంలో చేరచ్చుగా. నీకీ వంటరితనం బాధ తప్పుతుంది" సలహా ఇచ్చాడు.

"ఏం? మీ నాన్న మా నాన్న ఇచ్చిన కట్నం డబ్బులు ఏం చేసాడు? నా కట్నం డబ్బుని బేంక్‌లో ఎఫ్.డి వేసినా మీ జీతం కన్నా ఎక్కువ వడ్డీ వస్తుంది తెలుసా? నాకేం ఖర్మ బయటికి పోయి పనిచేయడానికి?" తెచ్చిపెట్టుకున్న సౌమ్యం ఎగిరిపోగా ఉగ్రంగా చెప్పింది గంగ.

"డబ్బు కోసం కాదు గంగా టైం పాస్ కోసం" నసిగాడు హరి.

"నా గురించి మీరేం బాధపడక్కర్లేదు. మీరు టైంకి ఎట్లా వెళ్తున్నారో అలాగే ఇంటికి టైముకి రావడం నేర్చుకోండి చాలు."

చిన్నగా తలమీద కొట్టుకుని బయటకి నడిచాడు హరి.

"పొద్దున చిలక్కి చెప్పినట్లు చెప్పాను. ఐనా మీ టైంకే మీరు వచ్చారు. ఎక్కడి నుంచి వచ్చారు?" కోపంగా అడిగింది.

"నెలాఖరులో నాకు ఆఫీసు పనులు ఎక్కువుంటాయని నీకు తెలుసుగా గంగా రోజూ ఎందుకిలా టార్చర్ పెడుతున్నావు" చిరాగ్గా అడిగాడు హరి.

"టార్చర్ పెడుతున్నానా? వేళ పట్టున ఇంటికి రమ్మనడం కూడా టార్చరేనా? నిజం చెప్పండి. ఎవరది?" ఆవేశంగా అడిగింది గంగ.

"ఎవరు ఎవరది?" అర్ధంకాక అడిగాడు హరి.

"అదే మీరు ఆఫీసు నుంచి డైరెక్టుగా వెళ్ళే సుందరి."

"సుందరా?" ఆమె ఏమంటుందో అర్ధమై చెప్పాడు హరి.

"నా మొహానికి మిస్సైస్ కూడానా గంగా?"

"ఏం మీకేం తక్కువా? ఎర్రగా బుర్రగా ఉంటారుగా." ఉక్రోషంగా అరిచింది గంగ.

"నీకు ఇన్ఫీరియారిటీ ఎక్కువైంది గంగా. నేను ఇష్టపడే నిన్ను పెళ్ళి చేసుకున్నాను. నువ్వు రంగు తక్కువని ఎన్నడూ అనుకోలేదు. నీకు కొంచెం కోపం, ఆవేశం ఎక్కువ అంతే కానీ, నీకేం బంగారం!" మృదువుగా చెప్పాడు.

"నాకు తెలుసు నేనెలా ఉంటానో. నన్ను మెచ్చారో నా కట్నం మెచ్చారో నాకు అనవసరం. మీరు మాత్రం పరాయి ఆడవాళ్ళతో మాట్లాడితే నేనేం చేస్తానో నాకు తెలీదు. జాగ్రత్తగా ఉండండి" బెదిరించింది గంగ.

మౌనంగా ఉండిపోయాడు హరి.

రాత్రి తొమ్మిదిన్నరకి భోజనాలు చేసి రిలాక్స్‌డ్‌గా టీ.వి చూస్తున్న సమయంలో ఫోన్ మోగింది. ఫోన్ ఎత్తిన హరి ఆనందంగా చెప్పాడు.

"హాయ్ అనూ! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు? ఇంతకాలానికి గుర్తొచ్చానా? చెప్పు ఏమిటి విశేషాలు?"

నిప్పులు కక్కే కళ్ళతో అతన్నే చూస్తూండిపోయింది గంగ. దాదాపు అరగంట మాట్లాడి ఫోన్ పెట్టేసాక భర్తని అడిగింది.

"ఎవరది? ఇప్పటిదాకా దానిదగ్గరే ఉండి వచ్చారుగా మళ్ళీ ఎందుకు ఫోన్? విరహమా?"

"ఛీఛీ నోటికి ఎంత వస్తే అంతా అనేయడమేనా? అనురాధ మా బాబాయి కూతురు ఫోన్ చేసింది. నీకు వావివరసలు కూడా లేవా గంగా?" క్రోధంగా అరిచాడు హరీష్

"పాడు కొంప శాంతి లేకుండా పోయింది" అనుకున్నాడు భారంగా.

ఇప్పుడు హరికి నిజంగానే ఒక 'తోడు' ఉంది. ఆఫీస్ నుంచి వచ్చేప్పుడు అక్కడ ఆగి కొంత 'సాంత్వన' పొంది ఇంటికి వస్తూంటాడు.

ఆనవాయితీగా గంగ అతన్ని సాధిస్తూనే ఉంది. కానీ హరి దానికి స్పందించడు - ఆ ఆరోపణ నిజమే కాబట్టి. కేవలం ఆమె వంక జాలిగా చూస్తుంటాడు అంతే.

బయటికి అరుస్తున్నా గంగలో ఒక గర్వం, ఒక ధీమా. తన భర్త తన నోటికి జడిసి తన చెప్పు చేతల్లోకి వచ్చేసాడు. ఇప్పుడు ఎదురు తిరిగి సమాధానాలు కూడా చెప్పడం లేదు. అందగాడైన భర్తని తను కొంగుకి కట్టేసుకుంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story